క్లుప్తంగా

తాగునీటి ఇబ్బందులు రానివ్వం



ఆత్మకూర్: పట్టణంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ నాగరాజు తెలిపారు. శనివారం గాంధీచౌక్‌లో తాగునీటి మెయిన్ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో సత్వర్వ చర్యలను చేపట్టారు. భారీ వాహనాలు పైప్‌లైన్ మీదుగా వెళ్లడడంతో పైప్‌లైన్ ధ్వంసమైందని వివరించారు. మిషన్ భగీరథ నీటి పథకంతో పాటు బోర్ల ద్వారా పట్టణంలో ప్రతి నిత్యం అవాంతరాలు లేకుండా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సొసైటీ, ఇతర ఎరువుల దుకాణాలను వనపర్తి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి సత్యంబాబు, ఏఓ చంద్రమౌళి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణాల్లో కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని, కొరత లేదని తెలిపారు. యూరియా అమ్మిన వెంటనే ఎప్పటికప్పుడు పీఓఎస్ మిషన్‌లో నమోదు చేయాలని డీలర్లను ఆదేశించారు. డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థికి అభినందన

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని రాజేశ్వరి ఈనెల 19న హైదరాబాద్‌లో జరిగే సైన్స్ సెమినార్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం గోపాల్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో జెడ్పీహెచ్ బాలుర స్కూల్ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో అప్పరాల జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థిని కె.రాజేశ్వరి అత్యుత్తమ ప్రతిభ కబనబర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌లో పాల్గొనేందుకు కృషి చేసిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడిని హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

‘యూనియన్లతో ఐక్యత పెరుగుతుంది’



వనపర్తి టౌన్: యూనియన్లతో కార్మికుల మధ్య ఉన్న విభేదాలు పరిష్కారం అయి ఐక్యత పెరుగుతుందని స్టాఫ్ అండ్ వర్కర్స్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) వీరాంజనేయులు, వ్యవస్థాపక కార్యదర్శి రాములు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డిపో ఎదుట ఆర్టీసీ డిపో అధ్యక్షుడు జేవీ స్వామి అధ్యక్షతన టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ 45వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. అనంతరం వారిని కార్మికులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఖయ్యూం, నాయకులు కృష్ణ, నరసింహ, బి.కృష్ణయ్య, నారాయణ, రాముడు పాల్గొన్నారు.

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ రికవరీ

గోపాల్‌పేట: ఫోన్ తప్పిపోయినా, చోరీకి గురి అయినా బాధితులు దిగులు చెందకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని గోపాల్‌పేట ఎస్ఐ వెంకటేశ్వర్లు కోరారు. ఆగస్టు 19న మండలంలోని ఆముదాలకుంటతండాకు చెందిన భీమ్లాకు చెందిన ఫోన్ పోయింది. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆగస్టు 24న పోలీసులు కేసు నమోదు చేశారు. సీఈఐఆర్ సౌకర్యం ద్వారా పోయిన ఫోన్ కనిపెట్టి తిరిగి బాధితుడికి శనివారం అప్పగించామని ఆయన తెలిపారు.

కమ్యూనిస్టులే నిజమైన వారసులు

పాన్‌గల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టులే నిజమైన వారసులని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాట వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నాడు ఎర్రజెండా నాయకత్వంలో జరిగిన రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య మొదలుకొని నాలుగు వేల మంది అమరులయ్యారని పేర్కొన్నారు. వారంతా పేదల పక్షాన నిలబడి పోరాడారని.. రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెడుతూ మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తుందని.. ప్రజలు ఒకసారి ఆలోచించి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు జమ్ములయ్య, భీమయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రయాస

- అవస్థలు పడ్డ ప్రయాణికులు
- బస్సులన్నీ కొల్లాపూర్ సభకే..
- 16 బస్సులతోనే నెట్టుకొచ్చిన ఆర్టీసీ



ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ప్రైవేట్ వాహనాలు

వనపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా ప్రయాణికులకు రవాణా కష్టాలు ఎదురయ్యాయి. జిల్లాకేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు బస్సులు లేక అవస్థలు పడ్డారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ బస్సులు లేకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. వనపర్తి డిపో పరిధిలో మొత్తం 106 బస్సులు ఉండగా అందులో 90 బస్సులను సీఎం సభకు తరలించడంతో డిపోలోని 32 మార్గాల్లో దాదాపుగా రాకపోకలు నిలిచిపోయాయి. వనపర్తితో పాటుగా వివిధ మండలాల నుంచి రాకపోకలు సాగించాలనుకునే అన్ని వర్గాల ప్రయాణికులకు రవాణ కష్టాలు తప్పలేదు.

విచారణ కేంద్రంలో కానరాని సిబ్బంది

బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులు గంటల తరబడి నిలబడినా.. బస్సులు రావట్లేదనే సమాచారం సైతం ప్రయాణికులకు చేరవేయడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారు. ఆర్టీసీ అధికారుల నుంచి ముందస్తు సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు చాలామట్టుకు బస్టాండ్ ప్రాంగణాల్లో ఇబ్బందులు పడ్డారు. సీఎం సభకు 90 బస్సులు, 90 మంది డ్రైవర్లు, ఐదుగురు అధికారులతో పాటు మరో ఐదుగురు కండక్టర్లను కేటాయించినట్లు డిపో అధికారులు తెలిపారు. మొత్తం బస్సుల్లో 16 బస్సులు మాత్రమే మిగిలి ఉండటంతో ఆ బస్సులతోనే కొన్ని రూట్లుల్లో గంటల తరబడి నిరీక్షించిన ప్రయాణికులకు అడపాదడపా సేవలు అందించినా.. అవి ఏమాత్రం ప్రయాణికులకు సంతృప్తికరంగా సేవలు అందిచలేకపోయాయి. ఉద్యోగాలకు వెళ్లే పలువురు ఉద్యోగులు, అధికారులు, కొన్ని చోట్ల విద్యార్థులు తమ రూట్‌లో వెళ్లే బస్సులు రాకపోవడంతో ప్రయాణాలను విరమించుకొని వెనుదిరిగిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇదే సమస్య తలెత్తింది. రాత్రి కొంత బస్సుల సంఖ్య పెరిగినప్పటికీ ప్రయాణికుల రద్దీ అంతగా లేకపోవడంతో ఆర్టీసీ బస్సులు అన్ని సీఎం సభ నుంచి డిపోకు పరిమితం కావాల్సి వచ్చింది.

ప్రైవేట్ జోరు

ఆర్టీసీ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలు తమ జోరును ప్రదర్శించాయి. ఆయా రూట్లల్లో వెళ్లే ప్రయాణికులను ఆకర్షించేందుకు ప్రయాణ ప్రాంగణంలోకి వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకున్నారు. ఆటోలు, జీపులు, క్రూజర్లు తదితర ప్రైవేట్ వాహనాలు సమీప ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తూ ప్రయాణికులతో రెట్టింపు చార్జీలను వసూలు చేశారు. వనపర్తి నుంచి మహబూబ్‌నగర్, కర్నూల్ వెళ్లాలనుకునే ప్రయాణికులకు ప్రైవేట్ వాహనాలు సైతం పెద్దగా అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులకు పాట్లు తప్పలేదు. పెబ్బేర్ నుంచి మహబూబ్‌నగర్, ఎర్రవల్లి, సమీప ప్రాంతాలకు ఆటో, జీపుల్లో ప్రయాణించగా వనపర్తి, కొత్తకోట నుంచి హైదరాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల రద్దీతో ప్రైవేట్ వాహనాలు జోరుగా రాకపోకలు సాగించాయి. ఈ విషయమై డిపో మేనేజర్ వేణుగోపాల్‌ను సాక్షి వివరణ కోరగా 90 బస్సులు అందుబాటులో లేవని ప్రయాణికులు ఇబ్బంది పడ్డ మాట వాస్తవమేనని అంగీకరించారు.

సాయుధ పోరాటాన్ని వక్రీకరించే కుట్ర



మాట్లాడుతున్న విజయరాములు

పెబ్బేరు రూరల్: తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో మహోజ్వల ఘట్టమని, ప్రస్తుత పాలకులు దానిని వక్రీకరించే కుట్రలు చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు ఆందోళన వ్యక్తం చేశారు. నాటి యోధుల స్ఫూర్తితో యువత ప్రజల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. శనివారం వనపర్తి జిల్లా సీపీఐ కార్యాలయంలో తెలంగాణ పోరాట సంస్మరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం బానిసత్వం నుంచి తెలంగాణ ప్రజల విముక్తి కోసం పోరాడారని కీర్తించారు. ఆ పోరాటం 4వేల మంది అమరులు కాగా 3వేల గ్రామాల్లో ప్రజా కంటకులైన దొరలను, భూస్వాములను తరిమికొట్టి పేదలకు 10 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన మన చరిత్ర సీపీఐ సొంతమని ఉద్ఘాటించారు. కమ్యూనిస్టుల పోరాటాన్ని త్యాగాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే పాలక పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ప్రజల్లో చైతన్యాన్ని నింపి సమస్యల పరిష్కారానికి సన్నద్ధం చేయడమే అమరులకు నిజమైన నివాళి అవుతుందన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, వంశీ, సీఎస్ శెట్టి, కడారి కృష్ణయ్య, మల్లేష్, రవీందర్, ఎర్ర కుర్మయ్య, చిలుక కృష్ణయ్య తిరుపతయ్య పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేయాలి



ధన్వంతరి, చరకుడు, త్యాగరాజు చిత్రాపటాలకు నివాళులర్పిస్తున్న నాయీబ్రాహ్మణులు

అమరచింత: ప్రభుత్వాలు నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలని ఆ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం నాయీ బ్రాహ్మణ కులవృత్తి దినోత్సవాన్ని పట్టణంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అశ్విని రమేష్, కోశాధికారి విశ్వనాథం హాజరై నాయీబ్రాహ్మణుల కుల దేవతలైన ధన్వంతరి మహర్షి, చరకుడు, త్యాగరాజస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచానికి ధన్వంతరి వైద్య సేవలు అందించారని, అలాంటి తెగలో పుట్టినందుకు ప్రతి నాయీబ్రాహ్మణుడు గర్వపడాలన్నారు. అనంతరం నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సీనియర్ నాయీలకు శాలువ, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో శివయ్య, అనిల్, లక్ష్మీనారాయణ, రాఘవేంద్ర, భాస్కర్, బాలస్వామి సురేష్, దుర్గాప్రసాద్, రవిచంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల నిరసన



వనపర్తిలో మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు, హెల్పర్లు

వనపర్తి: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నిరసన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి ఓఎస్‌డీ పూర్ణచంద్రారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు పుట్ట ఆంజనేయులు నిరసన కార్యక్రమంలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరంకుశంగా, నియంతృత్వంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో రమాదేవి, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, సావిత్రి, విజ్ఞులత, ఇందిర, విజయభారతి, విజయ, పద్మ సునంధ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శనివారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నిరసన చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు రూ.26 వేల వేతనాన్ని చెల్లించాలని కోరారు. పదవి విరమణ పొందిన తర్వాత రూ.5 లక్షల పరిహారంతో పాటు వేతనంలో సగం పింఛన్‌గా అందజేయాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు.

అక్రమ అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు



పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు



వనపర్తిలో బీజేపీ నాయకులు

అమరచింత: పాలమూర్-రంగారెడ్డి ఎత్తిపోథల పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం కేసీఆర్ వస్తున్నారనే కారణంతో ముందస్తుగా కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడం ఎంత వరకు సమంజసమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం తెల్లవారు జామున ఇంట్లో నిద్రిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామికమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కేసీఆర్ అవినీతిపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గద్దె దించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, శ్యాం కుమార్, హనుమంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ, కాంగ్రెస్ నాయకుల అరెస్టు

పెబ్బేరు రూరల్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోథల పథకంలో భాగంగా నార్లాపూర్ పంప్ హౌస్ ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ వచ్చినందున శనివారం శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలోని బీఎస్పీ, కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి అక్రమ అరెస్టులకు, నిర్బంధాలకు బహుజ సమాజ్‌పార్టీ భయపడదని స్పష్టం చేశారు.

ఆత్మకూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి కొల్లాపూర్‌కు వస్తున్న సందర్భంగా ఆత్మకూర్‌లో ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్, బీజేపీ, వాల్మీకి తదీతర సంఘాల నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రవిప్రకాష్ తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్నవారిలో ఎత్తం కృష్ణయ్య, మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, సుదర్శన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, నర్సింహ, గోపి, వెంకటేష్, ముత్యాలు తదితరులు ఉన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

వనపర్తి టౌన్: సీఎం కేసీఆర్ సభను ఆటంకం కలగకుండా శనివారం తెల్లవారుజామున బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి పరశురాం, పట్టణ అధ్యక్షుడు బచ్చు రామును జిల్లా కేంద్రంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ మీటింగ్‌కు కారణంగా కొన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం అవివేకమని, సభకు ఆర్టీసీ, స్కూల్ బస్సులను వాడుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ఇదేం పాలన అంటూ దుయ్యబట్టారు.

నేడు గరికపాటి భగవద్గీత సందేశం

ఆత్మకూర్: నిత్య జీవితంలో భగవద్గీత అనే అంశంపై గరికపాటి నరసింహారావు చేత సందేశ కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. శనివారం ఆత్మకూర్‌లోని ఎంపీ రామన్‌హైస్కూల్ ఆవరణలో సభ ప్రాంగణంలో ముమ్మరంగా ఏర్పాట్లను చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి నృత్యాలు, అన్నమయ్య సంకీర్తనలు, భగవద్గీత శ్లోకాలు, ఆధ్యాత్మిక గీతాలాపన, సాయంత్రం నాలుగు గంటలకు గరికపాటి సందేశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వహిందు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డితో పాటు శ్రీసంత్‌సదానంద గిరి మహారాజ్, ఆచార్య శ్రీనివాస్ తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమం ముగిసిన వెంటనే అందరికీ భోజన వసతిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, ప్రభాకర్‌రావు, మేర్వ రాజు, తమ్మలి విజయ్, రాజు, శివరాం, శ్రీనివాస్, రఘుపతిరెడ్డి కోరారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు



కొత్తకోట రూరల్: అతి వేగంతో వెళ్తున్న కారు డివైడర్ ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలైన ఘటన కొత్తకోట మండలం కనిమెట్ట సమీపంలో గల పిరమిడ్ దాబా సమీపంలో ఎన్‌హెచ్ 44పై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అతివేగంగా వెళ్తూ డివైడర్‌ను ఢీకొనడంతో కారులో ఉన్న దేవదాస్, ప్రణీత్‌కుమార్, మోహన్‌కుమార్, రాజేష్, సౌమ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



పెబ్బేరు రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే తేదీని ప్రకటించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు జిల్లా కేంద్రంలోని మర్రికుంట ధర్నా చౌక్‌లో చేస్తున్న రిలే దీక్షలు 3వ రోజుకు చేరింది. జిల్లా మహాజన్ ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ కొమ్ము చెన్నకేశవులు, ఎంఎస్పీ నాయకుడు గొర్ల బలరాం మాదిగ దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌కు వస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టే తేది ప్రకటించాలని, అలాగే కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీలో ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు మాదిగ, గంధం గట్టయ్య, పరశురాముడు, కురుమయ్య, రాముడు, విష్ణు, గద్దమీద రాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ



వనపర్తిలో మట్టి విగ్రహాలు తయారు చేసిన విద్యార్థినులు

వనపర్తి టౌన్: వినాయక చవితి సందర్భంగా ప్రజలు మట్టి విగ్రహాలను వాడాలని, మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని పరిరక్షించినట్లు అవుతుందని బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు చిన్న పద్మావతి అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు చిన్న పద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థినులు మట్టి గణపతులను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నతనం నుంచి పర్యావరణ పరిక్షణపై అవగాహన కల్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఆత్మకూర్: ఆర్యవైశ్య జిల్లా సంఘం, యువజన సంఘం, వాసవీ క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో మట్టితో తయారుచేసిన వినాయకుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా అధ్యక్షుడు కల్వ రాజయ్య, జిల్లా యువజన అధ్యక్షుడు నీలేష్ తెలిపారు. కార్యక్రమంలో పులిమామిడి రమేష్, విజయ్‌కుమార్, సూరంపల్లి నవీన్, శ్రీధర్, వెంకటస్వామి, రామ్మోహన్, రమేష్, కల్వరఘు, ఉదయ్‌సింగం, బాలకృష్ణ, రామకృష్ణ, కిరణ్, పద్మావతి, వీణశ్రీ, అర్చణ, లక్ష్మి, గాయత్రి, అనురాధ, పద్మలత, సాయిప్రభ, పావని, భార్గవి ఉన్నారు.

కొల్లాపూర్ తరలిన బీఆర్ఎస్ నాయకులు



పాన్‌గల్ నుంచి కొల్లాపూర్ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



మదనాపురంలో..



పెబ్బేరులో..

పాన్‌గల్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభం సందర్భంగా కొల్లాపూర్ పట్టణం సమీపంలో నిర్వహించే సీఎం కేసీఆర్ సభకు శనివారం మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామం నుంచి పలు వాహనాల్లో బీఆర్ఎస్ నేతలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్ మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా పాలమూరు సస్యశ్యామలం అవుతుందన్నారు. మండలంలోని 28 పంచాయతీలకు కేటాయించిన 91 ఆర్టీసీ బస్సులతో పాటు అదనంగా ప్రైవేట్ వాహనాల్లో మహిళలు, రైతులు స్వచ్ఛందంగా సభకు తరలినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బీరం ప్రతాప్‌రెడ్డి, వెంకట్రాములుయాదవ్, తిరుపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు శనివారం ప్రత్యేక వాహనాల్లో నార్లాపూర్‌కు తరలివెళ్లారు. పాలమూర్-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించడానికి సీఎం కేసీఆర్ నార్లాపూర్‌కు వస్తున్న సందర్భంగా కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలం నుంచి భారీ సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మదనాపురం: నార్లాపూర్ పంపు హౌజ్ వద్ద పాలమూరు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు శనివారం మండలం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మదనాపురం, దుప్పల్లి, కొన్నూరు, కొత్తపల్లి, గోపన్‌పేట, అజ్జకొల్లు, తిర్మలాయపల్లి, దంతనూరు, నిలివిడి, నర్సింగాపురవ, శంకరమ్మ పేట, గోవింద హళ్లి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ పంప్ హౌస్ ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు సభకు పెబ్బేరు, శ్రీరంగాపురం, వనపర్తి మండలంలోని ఆయా గ్రామాల నుంచి కార్యకర్తలు, మహిళలు, ప్రజాప్రతినిధులు భారీగా బయలుదేరారు.

ఆత్మకూర్: పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు కొల్లాపూర్ తరలివెళ్లారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కొల్లాపూర్ పట్టణానికి భారీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ రామన్‌గౌడ్, ముంత మల్లయ్యయాదవ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, ఎత్తం బాలస్వామి, శివయాదవ్, సురేష్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఎద్దుల సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.